కుళ్లిన కోడి గుడ్లు పంపిణీ

ప్రజాశక్తి-అరకులోయరూరల్:మండలంలోని పద్మాపురం మేజర్ పంచాయతీ దుమ్మగుడ అంగన్వాడీ కేంద్రంలో బుధవారం కుళ్లిన కోడి గుడ్లు పంపిణీ చేశారు. కోడిగుడ్లు ఉడికించి ఇస్తున్న సమయంలో కుళ్ళి పోయి ఉన్నాయని బాలింతలు, పిల్లలు ఆవేదన చెందుతున్నారు. రెండు రోజుల క్రితం ఇచ్చిన కోడి గుడ్లు సైతం కుళ్లిపోయిన గుడ్లు ఉన్నాయని గర్భిణిలు తెలిపారు. సైజు కూడా చిన్నవిగా ఉండడంతో పాటు కుళ్లి పోయినవి ఇస్తున్నారని పేర్కొన్నారు.

కుళ్లిన కోడి గుడ్లు

కనీసం వేతనం రూ.26వేలు చెల్లించాలని..

అంగన్‌వాడీల నిరసనలు

పెదబయలులో ఆందోళన చేపడుతున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి-పెదబయలు:అంగనవాడీ వర్కర్లకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించి, ఇతర సమస్యలను పరిష్కరించాలని అంగనవాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పిలుపుతో స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం ముందు సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, అంగాన వాడిలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిన్న చూపు చూస్తున్నాయని, పనుల పేరుతో వేధింపులు గురి చేస్తున్నాయని విమర్శించారు.వైఎస్సార్ సంపూర్ణ పోషణ మెనూ ఛార్జీలు పెంచాలని, గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్, వేతనంలో సగం పింఛను, సూపర్ వైజర్ పోస్టులకు వయో పరిమితి తొలగించాలని, రాజకీయ జోక్యం విడనాడాలని, జనాభా ప్రాపదికన మినీ అంగన్వాడీ కేంద్రాలను మెయిన్ కేంద్రాలుగా మార్చాలని డిమాండ్ చేశారు.ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జిఒ 1ని రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అల్లూరి జిల్లా సీఐటీయూ జిల్లా నాయకుడు బోండా సన్నిబాబు, ఉపాధ్యక్షుడు బోండా గంగాధరం, కార్యదర్శి కె.శరబన్న, శాంతి, భాగ్య, అంగనవాడిలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-విఆర్ పురం

అంగన్వాడీ కార్యకర్తలకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, ఫేస్ యాప్‌ను రద్దు చేయాలని కోరుతూ మండల కేంద్రంలోని రేకపల్లి ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన అంగన్వాడీలు నిరసన తెలిపారు. 14 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సూపర్వైజర్ నాగలక్ష్మికి అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల అధ్యక్షులు నాగమణి, ఉపాధ్యక్షులు రంగమ్మ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, కేంద్రాల్లో పర్యవేక్షణ పేరుతో వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. గ్రాడ్యుటీ అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ 5లక్షలు ఇవ్వాలని, పింఛను అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కనక లక్ష్మి, పండు, అంగన్వాడీలు పాల్గొన్నారు

అడ్డతీగల : స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం ఆవరణలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన నిరసన కార్యక్రమం చేపట్టారు. అంగన్వాడీలకు కనీస వేతనం ఇవ్వాలని, ఫేస్ యాప్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కార్యదర్శి బి నిర్మల, యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్షులు జి బేబీ రాణి, కె.అమ్మాణ, ఎం చంద్రకళ, జి లక్ష్మీ, కే బుల్లెమ్మ పాల్గొన్నారు.

కూనవరం : మండలంలోని సీడీపీఓ కార్యాలయానికి అంగన్వాడీ కార్యకర్తలు ర్యాలీగా వెళ్లి అక్కడ నిరసన తెలిపారు. అనంతరం సీడీపీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి కొమరం పెంటయ్య మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలకు గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చెయ్యాలని, 300 జనాభా దాటిన మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లు గా మార్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మడెం అన్నపూర్ణ, సూర్య కుమారి, సోదే అర్జమ్మ, సైకం కవిత, ఆదిలక్ష్మి, ముత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

అడ్డతీగలలో...

నినాదాలు చేస్తున్న నాయకులు

స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై

వామపక్షాల నిరసన

30న కార్మిక మహాగర్జనకు సంఘీభావం

ప్రజాశక్తి-పాడేరు:స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో పాడేరు ఐటీడీఏ ఎదుట బుధవారం వామపక్షాల ఆధ్వర్యాన నిరసన చేపట్టారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఈ నెల 30న నిర్వహించనున్న కార్మిక మహా గర్జనకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స, సిపిఐ జిల్లా కార్యదర్శి పోటిక సత్యనారాయణ మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్‌కు సొంతగనులు కేటాయించి, ప్రైవేటీకరణను విరమించుకోవాలన్నారు. బిఎస్ఎన్ఎల్, స్టీల్ ప్లాంట్, రైల్వే, తదితర ప్రభుత్వ సంస్థలను ప్రైవేటు సంస్థలకు దారాదత్తం చేయడానికి బిజెపి ప్రభుత్వం కుట్ర చేస్తుందని విమర్శించారు. దీన్ని ప్రజలంతా తిప్పి కొట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని పిలుపునిచ్చారు. ఆదివాసి ప్రాంతంలో హైడ్రో పవర్ ప్రాజెక్టు పేరుతో ఆదివాసుల భూములు అదానీ, అంబానీలకు కట్టబెడుతున్నారని, దీంతో గిరిజనులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. హైడ్రో పవర్ ప్రాజెక్టులను ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అమర్, లక్ష్మణ్, రాజశేఖర్, రాధాకృష్ణ, ప్రభుదాసు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సంక్షేమంపై శ్రద్ధ ఏదీ?

38వ రోజుకు రిలే నిరాహార దీక్ష

ప్రజాశక్తిపాడేరు: అల్లూరి జిల్లాలో గిరిజన విద్యార్థుల సంక్షేమాన్ని ప్రభుత్వం విస్మరించిందని సిపిఐ జిల్లా కార్యదర్శి పోటిక సత్యనారాయణ విమర్శించారు. ఐటి డిఎ గేటు ముందు ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం 38వ రోజు కొనసాగాయి ఈ దీక్షలో ఆయన పాల్గొని మద్దతు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ, గిరిజన విద్యార్థులు వరసగా చనిపోతున్నా కనీసం అధికారులు పట్టీ పట్టనట్లు వ్యవహరించడం చాలా దుర్మార్గమన్నారు. విద్యార్థుల మరణాలు అరికట్టేందుకు అధికారులు ప్రజాసంఘాలతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేయడంలో ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. గిరిజన విద్యార్థుల మరణాలు అరికట్టేం దుకు 260 మంది హెల్త్ అసిస్టెంట్లను కొనసాగించాలన్నారు. ప్రజా సంఘాలు, మీడియా ప్రతినిధులను గిరిజన విద్యా సంస్థల్లోకి ప్రవేశాన్ని నిరాకరిస్తూ గిరిజన సంక్షేమ ముఖ్య కార్యదర్శి జారీ చేసిన సర్క్యులర్ తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ కూడ రాధాకృష్ణ, కో కన్వీనర్ ప్రభుదాస్, కంబిడి లతాకుమారి, సంఘ నాయకులు ఎస్.బుజ్జి సుందర్, జి కృష్ణంరాజు, వి.నారాయణ, అరుణ, లలిత, కృష్ణవేణి, పుష్ప చంద్రకళ, కళావతి, సంఘాల వేదిక నాయకులు చిన్నారావు బత్తిరి నరేష్, తదితరులు పాల్గొన్నారు.

మెయిన్ కంట్రోల్ రూమ్‌లో ప్యానల్ బోర్డులను పరిశీలిస్తున్న శ్రీధర్

సీలేరు కాంప్లెక్స్ అభివృద్ధికి నిధులు సాధిస్తాం

చీఫ్ ఇంజినీర్ బొడ్డు శ్రీధర్

ప్రజాశక్తి -సీలేరు

సీలేరు కాంప్లెక్స్‌లో అభివృద్ధి పనులకు జెన్కో యాజమాన్యంతో పోరాడి నిధులు సాధించుకుంటామని ఎపి జెన్కో సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజినీర్ బొడ్డు శ్రీధర్ తెలిపారు. కార్మికులు సంక్షేమ గురించి కృషి చేస్తానని చెప్పారు. సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్‌గా ఈనెల 23న బాధ్యతలు చేపట్టిన శ్రీధర్ బుధవారం స్థానిక జల విద్యుత్ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తనకున్న పరిజ్ఞానం, గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని సీలేరులో 9 యూనిట్లతో 1350 మెగావాట్ల సామర్థ్యం గల పంపు స్టోరేజ్ ప్రాజెక్టు నెలకొల్పడానికి ఉన్నత అధికారులు సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్‌గా నియమించినట్లు వెల్లడించారు. ఏపీ జెన్కో శ్రీశైలం హైడల్ ప్రాజెక్ట్ లెఫ్ట్ రైట్ బ్యాంకులో 12 సంవత్సరాలపైనే ఏడిఈగా, డిఈగా విధులు నిర్వర్తించినట్లు చెప్పారు. విజయవాడ విద్యుత్ సౌధ హెడ్ క్వార్టర్‌లో చీఫ్ జనరల్ మేనేజర్ ఏడీఎంగా పని చేసినట్లు తెలిపారు. సీలేరు కాంప్లెక్స్ పరిధిలోని పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో 5, 6 యూనిట్లు నూతనంగా నెలకొల్పబోయే పనులకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ ఎప్పుడో పూర్తయిందని పేర్కొన్నారు. యూనిట్లు నెలకొల్పే ప్రదేశంలో క్లీనింగ్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని, యూనిట్ నిర్మాణం పనులు కంపెనీకి అప్పగించారని చెప్పారు.

జల విద్యుత్ కేంద్రాన్ని సందర్శించిన చీఫ్ ఇంజనీరు

స్థానిక జల విద్యుత్ కేంద్రాన్ని బుధవారం చీఫ్ ఇంజనీరు శ్రీధర్ సందర్శించారు. ఎస్ఇ సివిల్ కెకెవి.ప్రశాంత్ కుమార్, ఈఈలు జాకీర్ హుస్సేన్ లక్ష్మీనారాయణ, కార్మిక సంఘ నాయకులు వై.దాగ్రరాజు, ఇవివి సత్యనారాయణ, నాగరాజు తదితరులు చీఫ్ ఇంజనీర్‌కు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జెన్కో ఉన్నతాధికారులు, ఇంజనీర్లు, కార్మికులతో జల విద్యుత్ కేంద్రంలో సమావేశమయ్యారు. ఈఈ లక్ష్మీనారాయణ జల విద్యుత్ కేంద్రంలో ఇటీవల జరిగిన పలు అభివృద్ధి పనుల గురించి చీఫ్ ఇంజనీర్‌కు వివరించారు. ఇంజనీర్లు, కార్మికుల సమస్యలను చీఫ్ ఇంజనీర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం విధులకు హాజరవుతూ హెల్మెట్, ఐడి కార్డ్, యూనిఫారం తూచా తప్పక పాటించాలని ఆదేశించారు. అనంతరం జల విద్యుత్ కేంద్రంలో ఉన్న నాలుగు యూనిట్లు పనితీరును పరిశీలించారు. రెగ్యులేటరీ డ్యాం, మెయిన్ డ్యాం, ఇంటెక్ డ్యాంలో నీటి నిల్వలు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డ్యాం అండ్ పవర్ హౌస్ ఏడిఈ అప్పలనాయుడు, ఏఈ క్యాంపు సురేష్, మోతుగూడెం ఈఈ బాబురావు, ఎలక్ట్రికల్ ఏడిఈలు జె.సత్యనారాయణ వి.సూర్య కుమార్, మెకానికల్ ఏడిఈ బి.క్రాంతి, ఏఈలు రమేష్, సీతారాం, నాగబాబు, ఇంజనీర్లు, కార్మికులు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలకు సిద్ధం

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అల్లూరి సీతారామరాజు జిల్లా ఏర్పడిన తర్వాత ఈనెల 26న తొలిసారిగా గణతంత్ర వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాటు చేశారు. వేడుకల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు తావు లేకుండా పోలీసులు వారం రోజుల నుంచి ముమ్మర తనిఖీలు చేపట్టారు. గణతంత్ర దిన వేడుకలకు జిల్లా కేంద్రం పాడేరులోని తలారిసింగి ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల మైదానాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. వేదిక పక్కనే జిల్లా అధికారులు, నాయకులు కూర్చునేందుకు కుర్చీలను ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. అనంతరం పోలీసు బలగాల నుంచి సైనిక వందనాన్ని స్వీకరిస్తారు. జిల్లా ప్రగతిని, చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ ప్రసంగించనున్నారు. ప్రభుత్వ ప్రగతి, అభివృద్ధి, సంక్షేమ పథకాలు తెలియజేసేందుకు ప్రభుత్వ విభాగాల వారీగా స్టాల్స్‌ను సిద్ధం చేశారు. విద్యార్థులు నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలు, మాక్ డ్రిల్‌తో పాటు సాయుధ పోలీసు దళాల కవాతుకు అనుకూలంగా మైదానాన్ని తీర్చిదిద్దారు. వీటితో పాటు జిల్లా ప్రగతి, అభివృద్ధిని అమలు చేస్తున్న కార్యక్రమాలు తెలియజేసేలా వివిధ శాఖలకు చెందిన అధికారుల పర్యవేక్షణలో శకటాల ప్రదర్శనకు సిద్ధం చేశారు. ఉత్తమ ప్రతిభ కనబరచిన ఉద్యోగుల సేవలకు గుర్తింపుగా ప్రశంసా పత్రాలను అందజేస్తారు. బుధవారం విద్యార్థులు మాక్ డ్రిల్, డ్యాన్స్ రిహార్సల్స్ చేశారు.

గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లు పరిశీలన..

తలారిసింగి ప్రభుత్వ ఆశ్రమ పాఠశాల మైదానంలో బుధవారం గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లను డిఇఒ రమేష్, టిడబ్ల్యూ డిడి ఐ.కొండలరావు పరిశీలించారు. వేదిక, సిట్టింగ్, స్టాల్స్, శకటాలు తదితర ఏర్పాట్లను పాఠశాల హెచ్ఎం రీమలి జాన్‌ను అడిగి తెలుసుకున్నారు.

మాక్‌డ్రిల్ చేస్తున్న విద్యార్థులు

పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

విద్యార్థులకు వైద్య పరీక్షలు

డిఎం అండ్ హెచ్ఒ జమాల్ భాష

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలక్రిష్ణ ఆదేశాల మేరకు ఏజెన్సీ వ్యాప్తంగా జిటిడబ్ల్యూ ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని డిఎం అండ్ హెచ్ఒ సి.జమాల్ భాషా తెలిపారు. పాడేరు మండలంలోని కందమామిడి జిటిడబ్ల్యూ ఆశ్రమ బాలికల పాఠశాలలో బుధవారం మినములూరు పిహెచ్‌సి వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య పరీక్షలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడేరు డివిజన్ లోని పిహెచ్‌సిల పరిధిలో వైద్య శాఖ, విద్యా శాఖాధికారులు సమన్వయంతో ప్రణాళిక బద్ధంగా త్వరితగతిన విద్యార్థులకు వైద్య పరీక్షలను పూర్తి చేయాలన్నారు. అత్యవసర వైద్యం అవసరమైన వారిని గుర్తించి ఆసుపత్రులకు తరలించి మెరుగైన వైద్యం అందించాలన్నారు. అనుమానిత సికిల్ సెల్ అనీమియా కేసులను గుర్తించి తదుపరి పరీక్షలకు జిల్లా ఆసుపత్రి పాడేరు తరలించి నిర్ధారణ పరీక్షలు జరిపించాలని సూచించారు. వైద్యాధికారి, క్షేత్ర స్థాయి సిబ్బంది వైద్య పరీక్షలకు విధిగా హాజరు కావాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య విద్యను విద్యార్థులకు బోధించారు. పాఠశాలలోని కిచెన్ గదిని పరిశీలించి విద్యార్థులకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించారు. అనంతరం బంగారుమెట్ట అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. గర్భిణీలకు, బాలింతలకు, చిన్నారులకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. అర్హులైన చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా టిబి పర్యవేక్షకులు వి.కిరణ్, కందమామిడి జిటిడబ్ల్యూ ఆశ్రమ బాలికల పాఠశాల హెచ్ఎం, సిబ్బంది, మినుములూరు పిహెచ్ సి వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గున్నారు.

పశువుల దోపిడీదారులపై చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు:-మండలంలో కించాయి పుట్టు పంచాయతీ మినుములపుట్టు, ఏనుగురాయి పంచాయతీ జంగంసరియా, మజ్జిగూడ గ్రామాల్లో పశువులను దోపిడీ చేసి, వధించి మాంసం విక్రయిస్తున్న వారిపై కేసు నమోదు చేయాలని ఆయా గ్రామాల గిరిజనులు డిమాండ్ చేశారు. పలు గ్రామాల గిరిజనులు పశువులను దొంగలిస్తున్న వ్యక్తులను పట్టుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. ఈ సందర్భంగా గిరిజన రైతులు మాట్లాడుతూ, కొండ ప్రాంతంలో విక్రయిస్తుండగా కించాయిపుట్టు సెక్రటరీ గోపితో పట్టుకున్నామని తెలిపారు. సదరు వ్యక్తులను పోలీస్ స్టేషన్‌కు అప్పగించామన్నారు. వీరిపై గో హత్య నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రైతులు కిమ్ముడు గాసిరావు, ఎం.హరి, వి.అప్పారావు, కె.అర్జున్, వి.ధర్మారావు, అర్.నారాయణ, ఎస్.గాసిరామ్‌దొర డిమాండ్ చేశారు.

మాట్లాడుతున్న ఆయా గ్రామాల గిరిజనులు

గిరిజన చట్టాలు పటిష్ట అమలుకు ధర్నా

కొండపాడు భూములకు పట్టాలివ్వాలని డిమాండ్

ప్రజశక్తి-రాజవొమ్మంగి

గిరిజన హక్కులు, చట్టాలు పటిష్టంగా అమలు చేయాలని, కొండపోడు భూమినే నమ్ముకుంటూ సాగు చేస్తున్న గిరిజనులకు హక్కు పత్రాలు కల్పించాలంటూ గిరిజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం రాజవొమ్మంగి తహాసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. తొలత స్థానిక యూనియన్ బ్యాంకు నుండి తహసీల్దార్ కార్యాలయం వరకు గిరిజనలు పెద్ద సంఖ్యలో ప్రదర్శన నిర్వహించారు. తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా చేపట్టి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న గిరిజన వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు మాట్లాడుతూ 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, అటవీ హక్కుల చట్టం ప్రకారం సాగు చేసుకుంటున్న గిరిజనులకు పట్టా ఇవ్వాలని డిమాండ్ చేసారు. పోరాడి సాధించుకున్న గిరిజన చట్టాలు జీవోలు కోర్టు తీర్పులు పేరుతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలే కావాలని రద్దు చేయిస్తున్నాయని విమర్శించారు. గతంలో జీవో నెంబర్ 3ని సుప్రీం కోర్టు రద్దు చేస్తే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పట్టనట్టు ఉన్నాయని, ఇప్పుడు 1/70 చట్టాన్ని హైకోర్టు విచారణకు అనుమతి ఇచ్చిందని, కోర్టు అనుమతికి వ్యతిరేకంగా గిరిజనులు నిరసనలు చేస్తుంటే ప్రభుత్వాలు చోద్యం చూస్తున్నాయని విమర్శించారు. తక్షణం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 1/70 చట్టం పై సుప్రీంకోర్టు లో అప్పీలు దాకాలాలు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు కోండ్ల సూరిబాబు, కుంజం జగన్నాథం మాట్లాడుతూ అటవీ హక్కుల చట్టం ప్రకారం గిరిజనులు సాగు చేసుకుంటున్న కొండపోడు భూములకు ప్రతి గిరిజనుడికి పది ఎకరాలకు హక్కు పత్రం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని స్థానిక తహశీల్దార్ సుబ్రహ్మణ్య ఆచారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల నాయకులు కాళ్ళ రాజుబాబు, పెయ్యాల పాపారావు, జర్తా రాజుబాబు, పొత్తూరు సత్యనారాయణ, పి రాంబాబు, పి సత్యనారాయణ. పెద్ద సంఖ్యలో గిరిజనులు పాల్గొన్నారు.

గిరిజన సంఘం ఆధ్వర్యాన తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఆదివాసీలు

ఆర్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వకుంటే ఉధృత పోరాటం

-కాంటూరు లెక్కలతో సంబంధం లేకుండా వరద బాధితులకు న్యాయం చేయాలి
-సిపిఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్

ప్రజాశక్తి- కూనవరం

పోలవరం నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ తక్షణమే ఇవ్వాలని, లేకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని సిపిఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ హెచ్చరించారు. కూనవరంలోని మార్త శ్రీరామ్మూర్తి భవన్‌లో కొమరం పెంటయ్య అధ్యక్షతన బుధవారం జరిగిన సిపిఎం మండల జనరల్ బాడీ సమావేశంలో కిరణ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోలవరం నిర్వసితుల పట్ల నిర్లక్ష్య ధోరణితో, మోస పూరితంగా వ్యవహరిస్తున్నాయని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు ముంపు, కాంటూరు లెక్కలతో సంబంధం లేకుండా గతేడాది జులైలో వచ్చిన వరదలను అంచనా వేసి, వాటికి అనుగుణంగా రాబోయే బడ్జెట్‌లో ప్రతి నిర్వసితుడికి న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో ప్యాకేజీ ఇచ్చిన భూములకు రూ.5లక్షలు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం నేటికీ ఎవరికీ ఇవ్వక పోవడం ప్రభుత్వ మోసపూరిత మాటలకు నిదర్శనమన్నారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు, మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, మండల కమిటీ సభ్యులు కుంజా రాధ, జ్యోతి, బొర్రయ్య, సుబ్బయ్య, శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు తలగాని నాగరాజు, సర్పంచ్ సోదే శంకర్, ఎంపీటీసీ అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులతో జాతీయ ఆదివాసీ సంరక్షణ సమితి ప్రతినిధులు

రగ్గులు, దుప్పట్లు, దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-మారేడుమిల్లి

రంపచోడవరం మండలం మర్రివాడ పంచాయతీ పరిధి పెద్ద కొండ గ్రామంలో కొండ రెడ్డి తెగలకు చెందిన 25 కుటుంబాలకు జాతీయ ఆదివాసీ సంరక్షణ సమితి ఆధ్వర్యాన రగ్గులు, దుప్పట్లు, టీ షర్టలు, చిన్నపిల్లలకు దుస్తులు పంపిణీ చేశారు. గ్రామంలో గురువారం జరిగిన కొండరెడ్ల ఆత్మీయ కలయిక కార్యక్రమంలో ఈ మేరకు అందజేశారు. ఈ సందర్భంగా సమితి కన్వీనర్ కారం సీతారామన్న దొర మాట్లాడుతూ ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయలు, చట్టాలపై గిరిజనులకు అవగాహన ఉండాలన్నారు. ఏజెన్సీలోని పలు గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాలు లేవని, రోడ్లు అధ్వానంగా ఉండడం వల్ల గర్భిణులు, వృద్ధులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెద్దకొండ గ్రామానికి రహదారి మంజూరు చేసినట్లు చెప్పి రెండేళ్లు గడిచినా నేటికీ నిర్మాణం పనులు చేపట్టలేదని పేర్కొన్నారు. ఎస్‌టి సబ్ ప్లాన్ నిధులతో రోడ్లు వేయాలన్నారు. అర్హులైన గిరిజనులకు పక్క ఇళ్లు నిర్మించాలని కోరారు. పెద్ద కొండ గ్రామస్తుల సమస్యలను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పెద్ద కొండ మాజీ సర్పంచులు పల్లాల మంగి రెడ్డి, ఎర్రగొండ రాజారావు, గిరిజనులు పాల్గొన్నారు.

బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్

ప్రజాశక్తి - రంపచోడవరం

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భారత యువజన క్రీడా మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్రం కాకినాడ ఆధ్వర్యంలో బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ వి.శ్రీనివాస రావు బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సుమారు 160 మంది యువతీ యువకులకు వాలీబాల్, కబడ్డీ, షార్ట్ పుట్, 100 మీటర్స్ లాంగ్ జంప్ తదితర క్రీడలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు ఆరోగ్యానికి ఎంతగానో దోహదపడతాయని, క్రీడలతో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని చెప్పారు. నెహ్రూ యువ కేంద్ర ప్రతినిధి జి. సత్తిబాబు మాట్లాడుతూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు క్విట్ ఇండియా, ఫిట్ ఇండియా కార్యక్రమాల ద్వారా గ్రామీణ, పట్టణ గిరిజన ప్రాంత యువతను క్రీడల్లో భాగస్వామ్యం చేయడం వల్ల ఎన్నో ఉద్యోగ అవకాశాలు కలుగుతాయని పేర్కొన్నారు. ఆటలు పోటీలు విజేతలకు ప్రిన్సిపల్ చేతుల మీదగా మీదగా ప్రశంసా పత్రం జ్ఞాపిక బహుకరించారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నాగు, వెంకటేష్, కె ప్రభాకర్ రావు, రాజశేఖర్, సునీత కుమార్, సిహెచ్ చంటిబాబు పాల్గొన్నారు

స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొన్న విద్యార్థులు

రూ.లక్షలు దోచుకుంటున్న షాడో మేయర్లు

జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : జివిఎంసిలో నలుగురు షాడో మేయర్లు ఉన్నారని, వీరు రకరకాలుగా దోపిడీకి పాల్పడుతూ రూ.లక్షలు ఆర్జిస్తున్నారని జనసేన 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ఆరోపించారు. బుధవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రూ. 9 కోట్లు విలువైన పనులను కాంట్రాక్టర్లు చేస్తుండగా, వారిని షాడో మేయర్లు బెదిరించి దోచుకుంటున్నారని ఆరోపించారు. జివిఎంసి కమిషనర్ క్వార్టర్ భవనాన్ని నిర్మిస్తున్న కాంట్రాక్టర్ నుంచి, పూర్ణా మార్కెట్ షాపుల కేటాయింపులో వ్యాపారుల నుంచి అక్రమంగా రూ.లక్షలు దోచుకున్నారని విమర్శించారు. ఇటువంటి షాడో మేయర్లు తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, తప్పుడు కేసులు పెట్టిస్తున్నారని తెలిపారు. 22వ వార్డులో సుమారు రూ.మూడు కోట్ల విలువైన వివిధ అభివద్ధి పనులు చేసినట్లుగా షాడో మేయర్లు చెప్పడం పూర్తిగా అబద్ధం అన్నారు. రూ. 30 లక్షలకు మించి పనులు జరిగినట్లు నిరూపిస్తే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానని, కార్పొరేటర్ పదవికి రాజీనామా చేస్తానని సవాల్ చేశారు.

అక్కినేనిపై బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : అక్కినేని తొక్కినేని అంటూ సినీ హీరో బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలు మర్యాదగా వెనక్కి తీసుకోకుంటే ఆయన ఇంటి వద్ద ధర్నా చేస్తామని ఉత్తరాంధ్ర అక్కినేని అభిమానుల సంఘం అధ్యక్షుడు కె.రాము తెలిపారు. బుధవారం సాయంత్రం విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అక్కినేని అంటే ఆషా మాషీ కాదన్నారు. ప్రజలు సినీ నటుల్ని అనుసరిస్తుంటారని బాలకృష్ణ గుర్తించాలన్నారు. సమావేశంలో రమణారెడ్డి, దాసు తదితరులు పాల్గొన్నారు.

ఎయును సందర్శించిన చినజీయర్ స్వామీ

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : ఆంధ్రవిశ్వవిద్యాలయాన్ని త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి బుధవారం సందర్శించారు. ఏయూ వీసీ ఆచార్య ప్రసాద రెడ్డి ఆయనకు స్వాగతం పలికారు. ఏయూ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థుల హాస్టల్స్ మధ్య నూతనంగా అభివృద్ధి చేసిన 16 ఎకరాల క్రీడా మైదానాన్ని చినజీయర్ స్వామి ప్రారంభించారు. మైదాన ప్రాంగణంలో నూతనంగా నిర్మించనున్న స్థూపానికి భూమిపూజలో పాల్గొన్నారు. అనంతరం స్వామీజీ మాట్లాడుతూ విజ్ఞాన, వికాసానికి మూలకేంద్రంగా ఏయూ నిలవాలన్నారు. ఈ మైదానానికి తేజస్సును ఇచ్చే స్థానంగా ఊర్జా అనే పేరును పెట్టినట్లు ప్రకటించారు. అనంతరం విద్యార్థులతో కలసి 108 ఔషధ మొక్కలను నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

ఉడాన్ నుంచి 2.2 మిలియన్ ఆర్డర్ల డెలివరీ

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : భారతదేశంలో అతిపెద్ద బీ2బీ ఈ కామర్స్ సంస్థ ఉడాన్ 2022 సంవత్సరంలో 2.2 మిలియన్ ఆర్డర్ల అవసరాలను తీరుస్తూ 1.7 బిలియన్ ఉత్పత్తులను రవాణా చేసినట్లు వెల్లడించింది. ఈ ఆర్డర్లను 1200 పట్టణాలు, నగరాలలో 12500కు పైగా పిన్‌కోడ్‌లకు చేరవేసినట్లు వెల్లడించింది. నగరంలో జరిగిన కార్యక్రమంలో ఉడాన్ సిఇఒ, కో-ఫౌండర్ వైభవ్ గుప్తా మాట్లాడుతూ నిత్యావసరాల విభాగం కింద 9 లక్షల టన్నుల ఉత్పత్తులను తమ సంస్థ ద్వారా డెలివరీ చేశామని, ఉడాన్ ద్వారా 2.5 మిలియన్ ఆర్డర్లకు చెందిన 131 మిలియన్ ఉత్పత్తులను ఎలక్ట్రానిక్స్, జనరల్ మర్చండైజ్, లైఫ్‌స్టైల్ విభాగాలలో రవాణా చేశామని వెల్లడించారు.

లీడ్ భాగస్వామ్యంతో ఓలే సంస్థ స్కాలర్‌షిప్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : భారతదేశపు అగ్రగామి స్కూల్ ఎడ్‌టెక్ ప్లేయర్ భాగస్వామ్యంతో 3000కు పైగా పాఠశాలలను 12 లక్షల మంది విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి విద్యను అందించడానికి ఓలే సంస్థ స్కాలర్‌షిప్‌లను ప్రకటించింది. ఒలే ఇండియా భారతదేశంలో 246 మంది యువతులకు, ఆంధ్రప్రదేశ్‌లో 138 మంది బాలికలకు స్టెమ్ రంగాలలో కెరీర్ అభివృద్ధికి స్కాలర్‌షిప్‌ను అందించనుంది. ఈ స్కాలర్‌షిప్‌కు నగరం నుంచి తేజశ్రీ యువ స్కాలర్‌గా ఎంపికైంది. ఈ స్కాలర్‌షిప్‌లు సైన్స్ ప్రయోగాలు, ప్రాజెక్ట్ వర్క్ కోసం అందించనున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు.

గ్రూప్ -2 కోచింగ్ గొప్ప అవకాశం : మేయర్

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : అల్లూరి విజ్ఞాన కేంద్రం, అల్లూరి స్టడీ సర్కిల్ ఆధ్వర్యాన గ్రూప్- 2 పరీక్షకు సన్నద్ధమవుతున్న యువతకు కోచింగ్ ప్రారంభించి గొప్ప అవకాశాన్ని కల్పించారని మేయర్ గొలగాని హరివెంకటకుమారి పేర్కొన్నారు. బుధవారం తన కార్యాలయంలో శిక్షణ పోస్టర్‌ను నిర్వాహకులు కె.అభిమన్యుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్య వ్యాపారం అవుతున్న రోజుల్లో అల్లూరి స్టడీ సర్కిల్ సేవాదృక్పధాన్ని కొనియాడారు. యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

ఘనంగా ఓటర్ల దినోత్సవం

ప్రతిజ్ఞ చేయిస్తున్న పాడేరు కలెక్టర్

ప్రజాశక్తి - యంత్రాంగం

రంపచోడవరం : జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ విద్యా సంస్థల విద్యార్థులు, ఉపాధ్యాయులు, వివిధ శాఖల ఉద్యోగులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సాల్ పిఎంఆర్సి వద్ద ప్రారంభించినారు. ఈ ర్యాలీ స్థానిక తహశీల్దారు కార్యాలయం మీదుగా దేవీపట్నం సెంటర్ వరకు సాగింది. ఓటు హక్కుపై ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్ల నిండిన యువతి యువకులు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం తహశీల్దారు పొదిలి వెంకటేశ్వరరావు, సర్పంచ్ మంగ బొజ్జయ్య, డిప్యూటీ తహశీల్దారు ఎంవి సత్యనారాయణ, ఎంపీడీవో ఎంవిఆర్ కుమార్ బాబు, యంవివి సత్యనారాయణ దొర, పంచాయతీ కార్యదర్శి ఎన్. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అడ్డతీగల : స్థానిక తహశీల్దారు కార్యాలయం నుండి విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక దేవి గుడి సెంటర్‌లో మానవహారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో డిటి తేజస్విని, సీనియర్ అసిస్టెంట్ మోహన్, పంచాయతీ కార్యదర్శి అనురాధ, విఆర్‌ఓలు బాలయ్య, రాధయ్య, శివ, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మారేడుమిల్లి : మండల కేంద్రంలో ఎమ్మార్వో టి శ్రీనివాసరావు, ఎంపీడీవో వీర కిషోర్ ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించి ఓటర్లకు అవగాహన కల్పించారు. అనంతరం మారేడుమిల్లి పోలీస్ స్టేషన్ వద్ద నాలుగు రోడ్ల కూడలిలో మనవాహరం చేశారు. ఈ కార్యక్రమంలో మారేడుమిల్లి, గుర్తేడు ఎస్సైలు ఎస్ రాము, జ్వాలా సాగర్, మారేడుమిల్లి సర్పంచ్ కొండ జాకోబ్, వైస్ ఎంపీపీ లక్కకొండ రవికుమార్, మాజీ జెడ్పిటిసి సత్తి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీలేరు : జీకే వీధి మండలం సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ వాటర్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వినోద్ బాబు, అధ్యాపకులు పాల్గొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జాతీయ ఓటర్ దినోత్సవం కార్యక్రమంలో ఎంపీటీసీ పిల్ల సాంబమూర్తి, ఇన్‌ఛార్జి సర్పంచి కె.వల్లి ప్రసాద్, వీఆర్వో శ్రీను, ప్రధానోపాధ్యాయులు రామన్న పడాల్, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ వి. అప్పారావు పాల్గొన్నారు.

చింతూరు : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఐటిడిఎ ఇన్‌ఛార్జి పీవో సూరజ్ గనోరే ర్యాలీని ప్రారంభించారు. ఐటిడిఎ నుండి చింతూరు సెంటర్ వరకు ర్యాలీ చేసి అక్కడ మానవహారం నిర్మించి, ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు సాయికృష్ణ, ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ ఎస్. అప్పన్నమ్మ, అధ్యాపకులు వై.పద్మ, జి.హారతి, కె. శకుంతల, విడి. రవికుమార్, కె. శైలజ, సిహెచ్. రాజబాబు, కె. శ్రీలక్ష్మి, కె. శ్రీదేవి, ఎన్. రమేష్, ఆర్.మౌనిక, పి.ఏడుకొండలు, పి.గౌతమి, జి. సాయికుమార్, వై. ఇమ్మానుయేలు, పి. అలివేలు పాల్గొన్నారు.

పాడేరు: ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే భాద్యత ఓటరుదేనని, ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా తనకు నచ్చిన మంచి వ్యక్తిని ఎన్నుకోవటం ద్వారా ప్రజాస్వామ్య పరిరక్షణ జరుగుతుందని కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురష్కరించుకొని కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఒక సారి ఎన్నుకున్న వ్యక్తి ఐదేళ్ళ వరకు పదవి కాలం ఉన్నందున తప్పనిసరిగా మంచి వ్యక్తిని ఎన్ను కోవాలన్నారు. గత ఎన్నికల ఫలితాలు పరిశీలిస్తే 50 నుండి 60 శాతం మంది మాత్రమే ఎన్నికలలో పాల్గొన్నారని, ఎక్కువ శాతం ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. ఐటిడిఎలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి రోణంకి గోపాల కృష్ణ మాట్లాడుతూ, ఓటర్లందరూ ప్రజాస్వామ్యం పై విశ్వాశం ఉంచాలని, నిస్పక్షపాత, ప్రశాంత ఎన్నికలకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమాలలో సంయుక్త కలెక్టర్ జే.శివ శ్రీనివాసు, స్పెషల్ డిప్యూటి కలెక్టర్ వివిఎస్ శర్మ, ఇంచార్జ్ ఎఓ చిన్నికృష్ణ, తహసిల్దార్లు బివి రామారావు, వి.త్రినాధనాయుడు, ఐటిడిఎ సహాయ ప్రాజెక్ట్ అధికారులు ఎం.వెంకటేశ్వర రావు, విఎస్. ప్రభాకర్‌రావు, కలెక్టరేట్, ఐటిడిఎ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దుంబ్రిగూడ: ఓటర్ల దినోత్సవంను పురస్కరించుకొని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్, రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించి, మూడు రోడ్ల జంక్షన్ వద్ద మనవహారం చేపట్టారు. ఈ సందర్భంగా తహసిల్దార్ షేక్ ముజీబ్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటర్లు చాలా కీలకమన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్క పౌరులు ఓటు హక్కును నమోదు చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ హరి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు ,రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.
సిటిజన్ ఓటర్లును బొర్గం రాలజు లకు సన్మానిస్తున్న తహశీల్దార్.

హుకుంపేట: ఓటర్లు దినోత్సవం సందర్భంగా స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించి సిటిజన్ ఓటర్లను సన్మానించారు. నూతన ఓటర్లకు గుర్తింపు కార్డులను తహశీల్దార్ రాజ్యలక్ష్మీ అందజేశారు. అనంతరం తహశీల్దార్ మాట్లాడుతూ, 18సంవత్సరాలు నిండిన పౌరులకు భారత రాజ్యాంగం కల్పించిన హక్కుని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ జి.రంగారావు, విఆర్ఓ డి.కొండబాబు. రెవెన్యూ, సచివాలయంలో సిబ్బంది పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా జాతీయ సేవ పథకం ప్రోగ్రాం అధికారి బొమ్మలాట రమేష్ ఆధ్వర్యంలో బుధవారం కళాశాలలో ఓటర్ల దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డి.శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ, అర్హులైన వారంతా ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు దామోదరం, నూకరాజు, రమణ, వేణుగోపాల్, కోటి బాబు పాల్గొన్నారు.

పాడేరు టౌన్: పాడేరులో సర్పంచ్ కొట్టగుల్లి ఉషారాణి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఓటు అర్హత కలిగిన ప్రతి ఒక్కరినీ తమ ఓటు హక్కు వినియోగించుకునే విధంగా ప్రోత్సహించి ఎన్నికల్లో భాగస్వామ్యం చేయడమే జాతీయ ఓటర్ల దినోత్సవం ప్రధాన లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఒ కొండలరావు, టిడిపి నాయకులు కొట్టగుల్లి సుబ్బారావు, బూరెడ్డి రామానాయుడు, పంచాయతీ ఇఒ కృష్ణారావు, వార్డ్ మెంబర్లు శంకర్రావు, లక్ష్మీ, గంగమ్మ, సచివాలయం సెక్రటరీ దివాకర్, సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

అనంతగిరి: మండల కేంద్రంలో జూనియర్ కళాశాలలో ఇన్చార్జి తహశీల్దార్ పాత్రుడు, టోకురు పంచాయతీ కేంద్రంలో సర్పంచ్ కిల్లో. మొస్యలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

28న విశాఖకు సిఎం జగన్మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఈ నెల 28వ తేదీన విశాఖలో పర్యటించనున్నారు. ఈ పర్యటన వివరాలను సిఎంఒ ఆఫీస్ బుధవారం ఖరారు చేసింది. ఈ పర్యటనలో భాగంగా జగన్మోహన్‌రెడ్డి 28వ తేదీ ఉదయం 9:15 గంటలకు తాడేపల్లి నుంచి బయలుదేరి ప్రత్యేక విమానంలో బయలుదేరి 10:30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటారు. అక్కడి నుంచి నేరుగా చినముసిడివాడలోని విశాఖ శారదా పీఠం చేరుకొని పీఠం వార్షిక మహోత్సవంలో పాల్గొంటారు. అక్కడి నుంచి 12:50 గంటలకు బయలుదేరి అక్కయ్యపాలెం సాగరమాల కన్వెన్షన్‌కు చేరుకొని అనకాపల్లి ఎంపీ తనయుడి దంపతులను ఆశీర్వదిస్తారు. 1:30 గంటలకు రుషికొండ ఐటి పార్క్ వద్ద విశాఖపట్నం ఎంపీ ఎంవివి.సత్యనారాయణ ఇంటికి చేరుకుని ఆయన తనయుడి దంపతులను ఆశీర్వదిస్తారు. 1:55 గంటలకు ఐపిఎస్ అధికారి వి.విద్యాసాగర్‌నాయుడు దంపతులను ఆయన గృహంలో ఆశీర్వదించనున్నారు. 2:40 గంటలకు ప్రత్యేక విమానంలో బయలుదేరి తాడేపల్లి చేరుకుంటారు.

ఓటర్లలో చైతన్యం : లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : ఓటర్లలో చైతన్యం వస్తోందని సిబిఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఓటర్స్ ఫోరమ్ ఫర్ బెటర్ డెమోక్రసీ ఆధ్వర్యంలో అధ్యక్షులు నూకల సూర్యప్రకాష్ ఆధ్వర్యాన ఎంవిపి కాలనీలోని ఎఎస్ రాజా కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన "ఓటర్ల చైతన్య సభలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత రాజకీయాలు చాలా కలుషితమైపోయాన్నారు. ప్రతి ఒక్కరూ ఎన్నికలను గౌరవిస్తే, సమాజం చాలా వేగంగా మారుతుందన్నారు. ఎన్నికలు, రాజకీయాలు మనకు సంబంధించిన విషయం కాదని చాలా మంది అనుకుంటారని, కాని మన నిత్య జీవితంలో రాజకీయం ఇమిడి ఉందని, రోజువారి కష్టాలకు, ధరల పెరుగుదలకు, నిరుద్యోగ సమస్యకు, ప్రజల మధ్య, ప్రాంతాల మధ్య చెలరేగే చిచ్చుకు కారణం అసమర్ధత రాజకీయ నాయకులే మూల కారణం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జేడీ ఫౌండేషన్ కన్వీనర్ ప్రియాంక దండి, సమయం హేమంత్ కుమార్, కోన మంగయ్య నాయుడు, ఆదిబట్ల భాస్కర్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్‌గా మనోజ్ శర్మ

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : ఈస్ట్ కోస్ట్ రైల్వేలో జనరల్ మేనేజర్‌గా 1985 బ్యాచ్‌కు చెందిన ఇండియన్ రైల్వే సర్వీస్ ఆఫ్ ఇంజినీరింగ్ అధికారి మనోజ్‌శర్మ నియమితులయ్యారు. ఆయన ప్రస్తుతం ముంబైలో సెంట్రల్ రైల్వే (సిఆర్) చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (నిర్మాణం)గా పనిచేస్తున్నారు. రూర్కీ విశ్వవిద్యాలయం నుంచి సివిల్ ఇంజనీరింగ్‌లో డిగ్రీ, ఐఐటి ఢిల్లీ నుంచి టెక్నాలజీలో మాస్టర్స్ పూర్తి చేశారు.

లెనెవో ల్యాప్‌టాప్ విడుదల

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : అత్యాధునిక 13వ జెన్ ఇంటెల్ కోర్ ప్రాసెసర్స్‌తో తీర్చిదిద్దిన ల్యాప్‌టాప్ లెనెవో యోగా 9ఐను మంగళవారం విడుదలచేశారు. ఈ సందర్భంగా నగరంలో జరిగిన లాంచింగ్ కార్యక్రమంలో లెనోవో ఇండియా కన్స్యూమర్ బిజినెస్ డైరెక్టర్ దినేష్ నాయర్ మాట్లాడుతూ, ఇంటెల్ ఇవో ప్లాట్‌ఫామ్‌తో కూడిన ఈ ల్యాప్‌టాప్, ప్రీమియం మొబైల్ అనుభవాలను సృజనాత్మకంగా అందించేలా తీర్చిదిద్దినట్లు తెలిపారు. ఈ ల్యాప్‌టాప్‌ల ప్రారంభ ధర రూ.1,74,990 అని, లెనొవో ఎక్స్‌క్లూజివ్ స్టోర్స్, అమెజాన్ డాట్ ఇన్, క్రోమా, రిలయన్స్‌లో ఈ నెల 29వ తేదీ నుంచి లభించనున్నాయని పేర్కొన్నారు.

మధుమేహ నియంత్రణలో బాదం ముఖ్య భూమిక

- షీలా కృష్ణస్వామి

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : కండరాల శక్తి పునరుద్ధరణ, మధుమేహ నియంత్రణలో బాదంలు ఎంతో ఉపయోగకరంగా పనిచేస్తాయని ప్రముఖ ఆరోగ్య నిపుణులు షీలా కృష్ణస్వామి అన్నారు. విశాఖపట్నంలోని ప్రముఖ హోటల్‌లో నిర్వహించిన జాతీయ బాదం దినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బాదములు అత్యంత సహజసిద్ధమైన యాంటీ ఆక్సిడెంట్స్, ఆక్సిడేటివ్ ఒత్తిడి నుంచి బయటపడటానికి, రోగనిరోధక శక్తి మెరుగుపరుచుకోవడానికి తోడ్పడతాయని తెలిపారు. బరువు తగ్గేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. మరొక ముఖ్య అతిథి మెడికల్ డైరెక్టర్ కాస్మెటాలజిస్ట్ డాక్టర్ గీతికా మిట్టల్ గుప్తా మాట్లాడుతూ "బాదములలో అత్యధిక పరిమాణంలో విటమిన్ ఈ, పాలీఫినాల్స్ ఉన్నాయని, ఇవి చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెలబ్రిటీ మాస్టర్ ఇన్‌స్ట్రక్టర్ యాస్మిన్ కరాచీవాలా, భారతీయ సినీ, టీవీ నటి నిషా గణేష్, ఆయుర్వేద నిపుణులు డాక్టర్ నితికా కోహ్లి తదితరులు పాల్గొన్నారు..

చిరుధాన్యాల సాగుపై అవగాహన

మాట్లాడుతున్న అరుణ్‌కుమార్

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని సుకూరు సచివాలయంలో వ్యవసాయశాఖ పరిశీలకులు అరుణ్ కుమార్ చిరుధాన్యాల సాగుపై అవగాహన కల్పిం చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, చిరు ధాన్యాల సాగుతో ఆర్థికంగా లాభ ధాయకమన్నారు. మండల వ్యవసాయ అధికారి సరోజినీ మాట్లాడుతూ మండలంలో చిరు ధాన్యాల విత్తనములు సబ్సిడీ ద్వారా అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ దనాసాన సత్యవతి, రైతులు నారాయణ, గ్రామ పెద్దలు, వ్యవసాయ సహాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

పరీక్షలు చేస్తున్న వైద్యులు

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండలంలోని గెమ్మెలి ప్రాధమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ (బాలుర), పెదలోచలిలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించామని పాడేరు అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె. లీలా ప్రసాద్ బుధవారం స్థానిక విలేకరులకు తెలిపారు. గెమ్మెలి వైద్యాధికారి, సిబ్బంది విద్యార్థులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గెమ్మెలి వైద్యాధికారి ఎస్. విగ్నేష్, పాడేరు ఎపిడమిక్ సెల్ ఆరోగ్య విస్తరణ అధికారి గుల్లేలి సింహాద్రి, పెదలోచలి ప్రాధానోపాధ్యాయులు బి.ధర్మేంద్ర, వైద్య సిబ్బంది పాల్గున్నారు.

ముఖ్యమంత్రి వస్తే మొక్కలు తొలగిస్తారా!

ప్రజాశక్తి-పెందుర్తి : ముఖ్యమంత్రి వస్తున్నారని 97వ వార్డు చినముషిడివాడలో మొక్కలు తొలగించి, పర్యావరణాన్ని నాశనం చేస్తున్నారని జనసేన వీర మహిళలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వీర మహిళ పార్వతి మాట్లాడుతూ సీఎం వస్తున్నారని చుట్టుపక్కల దుకాణాలు కూడా మూడు రోజుల వరకు తెరవద్దని షాపు యాజమాన్లకు అధికారులు చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. శారదపీఠం వారోత్సవాల నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు గురిచేయడం సరికాదని, దీనిపై సిఎంజగన్‌తోపాటు నేతలు, అధికారులు ఎలాగూ పట్టించుకోని పరిస్థితి ఉన్నందున, స్వరూపానందేంద్ర సరస్వతి స్వామి అయినా దీనిపై స్పందించి, పేదలు, సామాన్య ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో జనసైనికులు సోమశేఖర్ నాయుడు, మధు, లక్కీ, గోవింద్ , పాల్గొన్నారు

ప్రకృతిపైనే మానవ మనుగడ

డాక్టర్ జమాల్ ఖాన్‌ను సత్కరిస్తున్న వైద్యసంఘం ప్రతినిధులు

ప్రజాశక్తి-చింతూరు : ప్రకృతిపైనే మానవ మనుగడ ఆధారపడి ఉందని చింతూరు రెవెన్యూ డివిజన్‌లోని నిమ్మలగూడెం ఆయుర్వేద వైద్యులు డాక్టర్ జమాల్ ఖాన్ అన్నారు. తిరుపతిలో ఈనెల 23, 24, 25 తేదీల్లో మూడు రోజులు పాటు జరిగిన పారంపర్య వైద్యుల జాతీయ సదస్సు బుధవారం ఘనంగా ముగిసింది. ఇందులో పాల్గొన్న జమాల్‌ఖాన్ మాట్లాడుతూ పూర్వీకులు వనమూలికలను ఉపయోగించుకొని ఎన్నో దీర్ఘకాలిక రోగాలను కూడా నయం చేసుకున్నారని తెలిపారు. రోజురోజుకు వాతావరణంలో వచ్చే మార్పులు, ప్రజలు తీసుకునే ఆహారం కలుషితం కారణంగా అనేక రోగాలు వ్యాపిస్తున్నాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ తమ నివాసాల్లో ఆయుర్వేదానికి సంబంధించిన ఔషధ మొక్కలను పెంచి భావితరాలకు మంచి ఆరోగ్యకరమైన జీవితాన్ని అందించాలన్నారు. నేడు చిన్నపిల్లలు మొదలుకొని వయోవృద్ధులు కూడా అనేక మంది రోగాల బారిన పడి ఇబ్బందులు పడుతున్నారని, రోగాలను ఎదుర్కోవాలంటే నేడు ఆయుర్వేదం ఒక్కటే శాశ్వత పరిష్కారమని చెప్పారు. ఆయుర్వేదంపై అవగాహన పెంచుకొని ఆరోగ్య నియమాలను పాటిస్తూ దురలవాట్లకు దూరంగా ఉంచాలని సూచించారు. ఎన్ని కోట్ల రూపాయలున్నా మానసిక ప్రశాంత ఉండదన్నారు. పర్యావరణ కాలుష్యంతో రోజురోజుకు ప్రకృతిలో పచ్చదనం దూరమై మానవ మనుగడకే ముప్పు వాటిని ప్రమాదం ఉందని చెప్పారు. అనంతరం పారంపర్య వైద్య మహా సంఘం అధ్యక్షులు చంద్రశేఖర్ రాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎన్ సావిత్రమ్మ జమాల్ ఖాన్‌ను శాలువాతో సత్కరించి మెమొంటో, సర్టిఫికెట్లను అందజేశారు.

ప్రతి ధాన్యం గింజనూ ప్రభుత్వం కొనాల్సిందే..

సిపిఎం మండల కార్యదర్శి సురేష్

మాట్లాడుతున్న సిపిఎం మండల కార్యదర్శి సురేష్

ప్రజాశక్తి- చింతూరు : రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేయాలని సిపిఎం మండల కార్యదర్శి సీసం సురేష్ డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోలు టార్గెట్ పూర్తయిందని, మళ్లీ కొనుగోలు ప్రారంభించాలంటే జిల్లా కలెక్టర్, సివిల్ సప్లై అనుమతిస్తేనే కొనుగోలు చేస్తామని చెప్పడం సరికాదని పేర్కొన్నారు. బుధవారం సిపిఎం నాయకులు పల్లపు వెంకట్ అధ్యక్షతన జరిగిన సిపిఎం మండల కమిటీ సమావేశంలో సురేష్ రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు సరఫరాతో పాటు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం, ఇప్పుడు టార్గెట్ పూర్తయిందని కొనుగోలు సాధ్యం కావడం లేదని చెప్పడం దారుణమన్నారు. దీని వల్ల రైతులు దళారుల బారిన పడి మోసపోతారని, ప్రభుత్వం లక్ష్యం నీరుగారుతుందని పేర్కొన్నారు. రైతుల పండించిన పంటకు మద్దతు ధర కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు, అన్నింటినీ మార్కెట్, కార్పొరేట్ల సంస్థలకు అప్పగిస్తుందని విమర్శించారు. ఈ సమావేశంలో కుంజా సీతారామయ్య, యర్రంశెట్టి, శ్రీనివాస్, మల్లం సుబ్బమ్మ, పోడియం లక్ష్మణ్, కారం సుబ్బారావు, ముర్రం రంగమ్మ, వేక రాజకుమార్, మడకం చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

విదేశీ విద్యార్థులకు ఉన్నత విద్యకు అనువైన వేదిక గీతం

ప్రజాశక్తి -మధురవాడ : వివిధ దేశాల విద్యార్థుల ఉన్నత విద్యకు గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం అనువైన వేదికగా ఉంటోందని వర్సిటీ విసి ప్రొఫెసర్ దయానంద సిద్ధపట్టం అన్నారు. బుధవారం గీతంలో నూతనంగా ప్రవేశం పొందిన విదేశీ విద్యార్థులకు అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల విభాగం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ, విదేశీ విద్యార్థులు తమ దేశసంస్కృతి, సంప్రదాయాలను అనుసరిస్తూ, ఇతర దేశాల విద్యార్థులతో సాంస్కతిక సంబంధాలను పెంచుకోవడం ద్వారా ఉన్నత వ్యక్తిత్వంతో పట్టభద్రులుగా తమ దేశాలకు వెళ్ళాలని ఆకాంక్షించారు. అంతర్జాతీయస్థాయి మౌలిక సదుపాయాలు, అధ్యాపకుల మార్గదర్శకంలో విదేశీ విద్యార్థులు సకాలంలో కోర్సులు పూర్తి చేసేందుకు అనువైన పరిస్థితులు గీతంలో కల్పిస్తున్నామన్నారు.

గీతం ప్రో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై. గౌతమరావు మాట్లాడుతూ విదేశీ విద్యార్థులు తమ మాతృదేశంలో ఉండి చదువుకునే భావన గీతంలో కలుగుతుందన్నారు. బోధన సదుపాయాలతో పాటు క్రీడలు, సాంస్కతిక అంశాలలో రాణించే విధంగా ప్రోత్సహిస్తున్నామన్నారు.

గీతం అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల విభాగం డైర్టర్ డాక్టర్ కె.పి.సి.కిషన్ మాట్లాడుతూ గీతంలో ప్రస్తుతం 45 దేశాలకు చెందిన 400 మంది విదేశీ విద్యార్థులు వివిధ కోర్సులు అభ్యసిస్తున్నారన్నారు. కొత్త విద్యా సంవత్సరంలో 161 మంది విద్యార్థులు ప్రవేశం పొందారని వెల్లడించారు. భారత ప్రభుత్వ స్టడీ ఇండియా కార్యక్రమం ద్వారా గీతంలో ప్రవేశం పొందుతున్న విదేశీ విద్యార్థుల సంఖ్య ఏటా పెరుగుతోందన్నారు. ప్రతిభ చూపిన వారికి ఏటా స్కాలర్ షిప్‌లు అందిస్తున్నామన్నారుఈ సందర్భంగా గీతం విద్యార్థి రచించిన జర్నీ ఆఫ్ 1000 మైల్స్ పుస్తకాన్ని విసి దయానంద ఆవిష్కరించారు. గీతం విదేశీ విద్యార్థుల సాంస్కతిక విభాగం ఆధ్వర్యంలో నూతన విద్యార్థులకు స్వాగతం పలుకుతూ వివిధ సంగీత, నృత్య కార్యక్రమాలు ప్రదర్శించారు.

'గణతంత్ర వేడుకలను బహిష్కరించండి'

ప్రజాశక్తి -జి.మాడుగుల : గణతంత్ర దినోత్సవ వేడుకలను బహిష్కరించాలని మావోయిస్టు నేత గణేష్ పేరిట స్థానిక విలేకరులకు బుధవారం లేఖను విడుదల చేశారు ఇందులో ఈ విధంగా పేర్కొన్నారు.ప్రజల పోరాట ఫలితంగా కొన్ని హక్కులు రూపొందించినా అవి ఆచరణలో అమలుకు నోచుకోలేదన్నారు.రాజ్యాంగాన్ని అమలు చేయడానికి పాలకవర్గాలు సిద్ధంగా లేవన్నారు. భారత రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ, బడా భూస్వామ్య, దళారీ బూర్జువా విధానాలకు మరింత సేవ చేయడానికి అనుకూలంగా అనేక సవరణల్ని చేసి, రాజ్యాంగ స్వభావాన్ని మార్చివేశారన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత హిందుత్వ ఫాసిస్టు ఎజెండాను అమలు చేయడానికి 'నయాభారత్' నిర్మాణం పేరుతో అన్ని వ్యవస్థల్లోకి తమ ఆర్ఎస్ఎస్ భావజాలంతో కూడిన వ్యక్తులను నియమిస్తుందన్నారు.

క్షయ వ్యాధిపై అప్రమత్తత

పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-అనంతగిరి: క్షయ వ్యాదుల నియంత్రణకు వైద్యాధికారులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర టిబి జాయింట్ వైద్య అధికారి డాక్టర్ రమేష్, సెంట్రల్ టిబి జాయింట్ డైరెక్టర్ డాక్టర్ వివేకానందగిరి సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులను బుధవారం పరిశీలించారు. అనంతరం అరకువేలి మండలం కొర్రగూడ, గాడు గూడలో పర్యటించి . క్షయ వ్యాధి పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు టీవీఎస్ నాయుడు, విగ్నేష్, విష్ణు, సుంకరమెట్ట పీహెచ్‌ఈ వైద్యాధికారిత బుజ్జి బాబు, అనంతగిరి మండలం పిహెచ్‌సి వైద్యాధికారి జ్ఞానేశ్వరి, లక్ష్మణ్, సంజీవరావు తదితరులు పాల్గొన్నారు

మితిమీరిన యాంటీ బయాటిక్స్‌తో ముప్పు

గీతంలో డబ్ల్యుహెచ్ఒ మాజీ అధికారి డాక్టర కేథరిన్

ప్రజాశక్తి-మధురవాడ : వివిధ రోగాలకు చికిత్స తీసుకునే సమయంలో మితిమీరిన యాంటీ బయాటిక్ ఔషధాలను వాడటం ఆరోగ్యానికి ముప్పు తప్పదని, ముఖ్యంగా రోగనిరోధక శక్తిని ఇవి హరిస్తాయనిప్రపంచ ఆరోగ్య సంస్థ ఆగ్నేయ ఆసియా దేశాల ప్రాంతీయ విభాగం మాజీ సలహదారు, యుకెలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ డెవలప్మెంట్ స్టడీస్ ప్రొఫెసర్ డాక్టర్ కేథరీన్ అన్నె హెరీలోవే అన్నారు. బుధవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ ఫార్మశీ నిర్వహించిన కార్యక్రమం మాట్లాడుతూ, అవసరానికి మించి యాంటీ బయాటిక్‌లను వాడటం వల్ల యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఎఎస్ఆర్) సమస్య పెరుగుతుందన్నారు.

ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారం 2050 నాటికి ప్రపంచ వ్యాప్తంగా 10 మిలియన్ల జనాభా ఎఎస్ఆర్ కారణంగా మరణిస్తారన్నారు. రక్షిత మంచినీరు లేకపోవడం, అపరిశుభ్ర పరిసరాలలో జీవనం, చేతి శుభ్రత పాటించక పోవడం, ఎఎస్ఆర్ సమస్యకు దారి తీస్తుందని, దీనిపై ప్రజల్లో చైతన్యం కలిగించాల్సిన బాధ్యత క్లినికల్ ఫార్మసిస్ట్‌లపై ఉందన్నారు. దీనికి సంబంధించిన బోధన అంశాలను పాఠ్యప్రణాళికలో భాగం చేయాలని సూచించారు. గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ ప్రొ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ బి. గీతాంజలి అధ్యక్షత వహించిన సదస్సులో స్కూల్ ఆఫ్ ఫార్మశీ డీన్ ప్రొఫెసర్ పి.రామారావు, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్. రాజా పాల్గొన్నారు.